ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శనివారం 19 అక్టోబరు 2024
5







నాలుగింటిపై నజర్

- పురపాలకాలపై 'కాంగ్రెస్' కన్ను
- ప్రధాన ప్రతిపక్షాల ముఖ్యనేతలను తనవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు
- 3నెలల ముందే హీటెక్కుతున్న మునిసిపాలి'ట్రిక్స్'
- రెండుచోట్ల తారుమారైన రాజకీయాలు

మహబూబాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పునర్వైభవం కోసం కాంగ్రెస్ దృష్టి సారించింది. ఇటీవల జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీవిజయం సాధించడంతో.. ప్రధాన ప్రతిపక్షాల ముఖ్య నేతలను తనవైపు తిప్పుకుంటోంది. బీఆర్ఎస్ రెండు దఫాలు రాష్ట్ర అధికారంలో వచ్చినప్పుడు స్థానిక సంస్థలు, మునిసిపాలిటీలు ఇలా అన్నింటా విజయాలను తన ఖాతాలోనే వేసుకుంది. అదే తరహాలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ స్థానిక సంస్థలు, మునిసిపాలిటీలపై దృష్టి కేంద్రీకరిస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని చోటమోటా నాయకులంతా భవిష్యత్ రాజకీయ లబ్ధికోసం, ప్రజాప్రతినిధులు కావడం కోసం పల్లెలపై పట్టు పెంచుకోవడం లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలతో టచ్‌లో ఉంటున్నారు. కొందరైతే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందే కండువాలు మార్చేశారు. కాంగ్రెస్ జెండాను మోసేశారు. కాస్తోకూస్తో ఇంకా మిగిలిన నేతలు రాష్ట్రంలో అధికారం మార్పిడితోనే తాము సైతం ప్లేట్ ఫిరాయించేశారు.

ఇక స్థానిక సంస్థల ఎన్నికల విషయానికొస్తే బీసీ గణన తర్వాతే జరిగే అవకాశాలు ఉన్న క్రమంలో ఇటు జిల్లాలోని మునిసిపాలిటీల్లో కూడా రాజకీయం వేడేక్కుతోంది. మునిసిపాలిటీల పదవీకాలం జనవరి 2025తో ముగుస్తోంది. అయినప్పటికి మూడునెలల ముందే మేజర్ మునిసిపాలిటీ అయిన మహబూబాబాద్‌తో పాటు డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాటీల్లోనూ ఆశావహులు వార్డుల బెర్తులు సిద్ధం చేసుకుంటున్నారు. రిజర్వేషన్‌లు మారితే ఫలానా నాయకుడని, సామాజిక వర్గాల వారీగా ఔత్సాహికులు ఆయావార్డుల పరిధిలో నాయకత్వ పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మెజార్టీగా కాంగ్రెస్ టికెట్ సంపాదించాలన్న పోటీ కన్పిస్తోంది. ఒకవేళ ఇదికాకుంటే ప్రధాన ప్రతిపక్షం నుంచైనా బరిలో నిలవాలని ఉవ్విలూరుతున్నారు.

మహబూబాబాద్ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మహబూబాబాద్ మునిసిపాలిటీ ఉండగా ఇదే పార్లమెంట్ పరిధిలోని డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో డోర్నకల్, మరిపెడ మునిసిపాలిటీలు ఉన్నాయి. ఇక వరంగల్ పార్లమెంట్, పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో తొర్రూరు మునిసిపాలిటీ ఉంది. ఈ నేపథ్యంలో ఆయా ఎంపీలు, ఎమ్మెల్యేల ఆశీస్సులు పొంది కాంగ్రెస్ నుంచి రంగంలో దిగాలని పలువురు ప్రయత్నాలు మొదలెట్టినట్లు సమాచారం అందుతోంది. ఇక పూర్వంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తాజామాజీ ఎంపీలు, ఎమ్మెల్యేల ఆశీస్సులతో తమ అదృష్టాన్నిపరిక్షించుకోవాలని మరికొందరు సిట్టింగ్‌లు, మాజీలు వారి బంధువులుప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నాటికి నేటికి తారుమారు

2020 జనవరిలో జరిగిన మునిసిపాలిటీ ఎన్నికల్లో మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ తొర్రూరులను ఏకపక్షంగా బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మహబూబాబాద్‌లో 36 వార్డులు ఉండగా, ఒక్కస్థానం బీఆర్ఎస్ ఏకగ్రీవం కాగా, మిగతా 35 వార్డుల్లో 18 స్థానాలు బీఆర్ఎస్‌కే దక్కాయి. వెరసి బీఆర్ఎస్ సంఖ్య 19కి చేరింది. పది స్థానాల్లో కాంగ్రెస్, మూడుస్థానాల్లో స్వతంత్రులు, రెండుస్థానాలు సీపీఐ, మరో రెండుస్థానాలు సీపీఎం దక్కించుకున్నాయి. 19 స్థానాలతో బీఆర్ఎస్ అభ్యర్థులు పాల్వాయి రాంమోహన్‌రెడ్డి చైర్మన్‌గా, మైనార్టీకి చెందిన ఎండీ ఫరీద్ వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇందులో ఒకవార్డు సభ్యుడు రవి హత్యకు గురికావడంతో ఉపఎన్నికల నిర్వహించలేదు. కాగా, ఈ ఏడాది మార్చిలో వివిధ కారణాలతో వైస్‌చైర్మన్ పై అధికారప్రతిపక్షాలు అవిశ్వాసం పెట్టడంతో తిరిగి బీఆర్ఎస్‌కు చెందిన మార్నేని వెంకన్న ఆ స్థానాన్ని భర్తీ చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కౌన్సిలర్ల సంఖ్య 22 కాగా, కాంగ్రెస్ 09, వామపక్షాల్లో నలుగురు ఉన్నారు.

తొర్రూరు మునిసిపాలిటీలో

తొర్రూరు మునిసిపాలిటీలో 16 వార్డులకుగాను రెండు స్థానాలు బీఆర్ఎస్ ఏకగ్రీవం చేసుకుంది. మిగిలిన 14 స్థానాల్లో 10 స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకోగా, 03 కాంగ్రెస్, ఒకటి బీజేపీ వశమైంది. 12 స్థానాల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థులు చైర్మన్‌గా మంగళంపల్లి రాంచంద్రయ్య, వైస్ చైర్మన్‌గా సురేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ సభ్యులు ఒకరు బీఆర్ఎస్ గూటికి చేరుకోగా, వారిసంఖ్య 13కు పెరిగింది. ఇందులో ఒక సభ్యుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రస్తుతం మారినరాజకీయాల్లో చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో పాటు మరో ఇద్దరు కాంగ్రెస్‌పార్టీలోకి చేరిపోయారు. దీంతో కాంగ్రెస్ సంఖ్య ఏడుకు చేరింది. బీఆర్ఎస్‌లో కూడా ఏడుగురు ఉండగా, ఒకరు బీజేపీలో ఉన్నారు.

డోర్నకల్‌లో

డోర్నకల్‌లో 15 వార్డులకు గాను ఒకవార్డును బీఆర్ఎస్ ఏకగ్రీవం చేసుకుంది. మిగిలిన 14 వార్డుల ఎన్నికల్లో 10 స్థానాలను తమ ఖాతాలో వేసుకోగా, ఒకటి కాంగ్రెస్, ముగ్గురు స్వతంత్రులు గెలిచారు. 11 స్థానాల్లో గెలిచిన బీఆర్ఎస్ సభ్యులు చైర్మన్‌గా వాంకుడోతు వీరన్న, వైస్‌చైర్మన్‌గా కోటిలింగంను ఎన్నుకున్నారు. ఆ తర్వాత ముగ్గురు స్వతంత్రులు బీఆర్ఎస్ గూటికి రాగా, వారి బలం 14కు చేరుకుంది. కాంగ్రెస్ నుంచి ఒకేఒక్క సభ్యుడు ఉండగా, మారిన రాజకీయాల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు మరో ముగ్గురు కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ బలం ప్రస్తుతం ఆరుకు చేరింది. స్వతంత్ర అభ్యర్థి యథావిధిగా బీఆర్ఎస్‌ను వీడి స్వతంత్ర అభ్యర్థిగానే ఉంటున్నట్లు ప్రకటించుకున్నారు. కాగా, బీఆర్ఎస్ వార్డు కౌన్సిలర్ల సంఖ్య 8కి తగ్గింది.

మరిపెడలో

మరిపెడలో 15 వార్డులకు గాను రెండింటిని ఏకగ్రీవం చేసుకున్న బీఆర్ఎస్ మిగిలిన 13 స్థానాల్లోనూ విజయం సాధించింది. మొత్తం స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ సభ్యులు చైర్మన్‌గా గుగులోతు సింధూరకుమారి, వైస్ చైర్మన్‌గా ముదిరెడ్డి బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు. ప్రస్తుతం మారిన రాజకీయాల్లో ఒక్క కౌన్సిలర్ మాత్రం కాంగ్రెస్‌లో చేరారు. 14 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు.

ఎన్నో వివాదాలు.. మరెన్నో సమస్యలు..

- ఆర్థిక ఇబ్బందులకు తోడు విద్యార్థుల ఆందోళనలతో కేయూ సతమతం
- కొత్తవీసీ ప్రతాప్‌రెడ్డికి సమస్యల స్వాగతం
- ప్రక్షాళనపై అందరిలోనూ ఆశలు

రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా పేరున్న వరంగల్ కాకతీయ యూనివర్సిటీని ప్రస్తుతం ఎన్నో వివాదాలు చుట్టుముట్టాయి. ఎన్నడూ లేని విధంగా కొన్నేళ్లుగా అనేక సమస్యలు తలెత్తున్నాయి. ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు రాక.. వచ్చిన నిధులు సక్రమంగా వినియోగం అవక అప్రదిష్టను మూటగట్టుకుంటోంది. వీటికి తోడు తాజాగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదురవుతుండగా.. ఉద్యోగులకు జీతాలు కూడా సరైన సమయంలో ఇవ్వలేదని దుస్థితి నెలకొంది. ఇదంతా ఒక ఎత్తయితే వర్సిటీకి ఇప్పటి వరకు వైస్‌చాన్స్‌లర్లుగా పనిచేసిన ప్రొఫెసర్లు వివాదాల్లో ఇరుక్కోవడం మరో ఎత్తు. ఇక కంచే చేనుమేసిన చందంగా వర్సి టీ ఉన్నతాధికారులు, పాలక మండలి సభ్యులను సైతం పక్కాదారి పట్టించి ఉద్యోగులే వర్సిటీ భూముల కబ్జాలకు దిగారు. దీంతోపాటు పరీక్షల విభాగంలో అవకతవకలు, కొత్త కోర్సులరాక, ఉన్న కోర్సుల అప్‌గ్రేడేషన్, ప్రొఫెసర్ల కొరత, కళాశాలలు, హాస్టళ్లలో సమస్యల దరువు తదితర సమస్యలు చుట్టుముట్టిన వేళ కొత్త వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఇకనైనా కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన జరగుతుందని అందరూ ఆశిస్తున్నారు.

- కేయూ క్యాంపస్

7

కేయూ వీసీగా ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి

- 13వ వైస్‌చాన్సలర్‌గా నేడు బాధ్యతల స్వీకరణ
- మరో రెండు వర్సిటీలకు వీసీలుగా కేయూ ప్రొఫెసర్లు
- తెలంగాణ వర్సిటీకి యాదగిరిరావు, మహాత్మాగాంధీ వీసీగా అల్తాఫ్‌హుస్సేన్

7



ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేయించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన యువతీ, యువకులను ఓటరుగా నమోదు చేయించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025 స్వీప్ ఆక్టివిటీ ఎపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025 స్వీప్ ఆక్టివిటీస్ ద్వారా జిల్లాలో 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేసుకునేందుకు యాక్షన్ ప్లాన్ ప్రకారం విద్యాసంస్థలు, గ్రామీణ, పట్టణ పరిధిల్లో బీఎల్వోలు, స్వయం సహాయక బృందాలు, ఎన్నికల విభాగం సిబ్బంది యువతలో చైతన్యం కల్పించి ఓటరు నమోదు చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలోఅదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా అధికారులు మధుసూదన్ రాజు, జి.మరియన్న, హరిప్రసాద్, రాజేశ్వర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచాలి

ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిని ఇన్వెష్టిగేషన్ పూర్తిచేసి, కోర్టుల్లో చార్జీషీట్ దాఖలు చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేసి చట్టపరిధిలో నిందితులకు శిక్షలు పడేలాచూడాలన్నారు. నేరాలు జరగకుండా రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలన్నారు. పాతకేసుల్లో ఉన్న నిందితులను నిరంతరం గమనిస్తూ ఉండాలని చెప్పారు. మహిళా అదృశ్యం కేసుల్లో ఎలాంటి కారణాలున్నపటికి త్వరగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. డయల్-100 కాల్స్ పట్ల తక్షణమే స్పందించి ఎలాంటి ఆలస్యం చేయకుండా సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఆవశ్యకతను ప్రజలకు అవవగాహన కల్పించి, లేనిచోట కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు నిరుపయోగంగా ఉన్న వాటిని పునరుద్ధరించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గుట్కా, గంజాయి, పేకాట మొదలగు చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో రోజు ఉదయం, సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహించి డ్రంక్ అండ్‌డ్రైవ్ తనిఖీలు చేయాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులు అందించారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, శ్రీనివాస్, తిరుపతిరావు, సత్యనారాయణ, చంద్రమౌళి, నరేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో రివార్డులు పొందిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్

ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకోవాలి

జైళ్ల శాఖ డీఐజీ సంపత్‌కుమార్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : వివిధ కేసుల్లో జైలుకు వచ్చిన ఖైదీలు సత్‌ప్రవర్తనను అలవర్చుకోవాలని జైళ్ల శాఖ డీఐజీ సంపత్‌కుమార్ సూచించారు. మహబూబాబాద్ సబ్ జైలును శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, జైలు మొత్తం కలియతిరిగారు. ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పద్ధతులు, విషయాలపై సబ్‌జైలు సూపరిండెంట్ మల్లెల శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. జైలులో పరిశుభ్రత పచ్చటి వాతావరణం, ఖైదీల సంక్షేమం పట్ల డీఐజీ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఖైదీల సమస్యలను అడిగితెలుసుకున్నారు. తొలుత డీఐజీ సంపత్‌కుమార్‌కు వరంగల్ సబ్‌జైలు అధికారి విజయ్‌డేని పుష్పగుచ్ఛం అందించగా, మహబూబాబాద్ సబ్‌జైలు అధికారి శాలువా కప్పి, మెమొంటోతో సన్మానించారు. జైలు సిబ్బంది బిక్షపతి, సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్‌రామరాజు, నిరంజన్ పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉండాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి టీజీపీఎస్సీ -3 పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్, సంబంధిత అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు అధికారులు తయార్‌గా ఉండాలని సూచించారు. స్ట్రాంగ్‌రూములను సిద్ధం చేయాలని, రూట్ మ్యాప్‌ల ప్రకారం సిబ్బందని నియమించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మూడు పేపర్లకు గాను నవంబరు 17న, ఉదయం ఒక పేపర్, సాయంత్రం ఒక పేపర్, 18న ఉదయం మరో పేపర్‌కు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో మహబూబాబాద్ డివిజన్‌లో 13, తొర్రూరు డివిజన్‌లో 08 ఉన్నాయని జిల్లా వ్యాప్తంగా 7,704 మంది పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్, రెవెన్యూ, ఆర్టీవో సంబంధిత శాఖల సిబ్బందితో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందని, పరీక్షల నిర్వహణకు అన్ని విధాల సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ వీసీలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బలరాం నాయక్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

'తుపాకులగూడెం' ఎత్తు తగ్గింపుతో..

నీటి లభ్యతకు సమస్య లేదు

- నీటిపారుదలశాఖ డివిజన్-2 ఈఈ జగదీశ్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

8

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ పోటీలో రాణించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈనెల 29న జరిగే రాష్ట్రస్థాయి సెమినార్ పోటీలో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏకశిల ఏంజిల్స్ హై స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో జిల్లా వ్యాప్తంగా 32 మంది విద్యార్థులు పాల్గొనగా కురవి మండలం జడ్పీహెచ్ఎస్ మోదుగులగూడెం విద్యార్థి వేదవ్యాస్ ప్రథమస్థానంలో నిలవగా, గూడూరు మండలం జడ్పీహెచ్ఎస్ పెనుగొండ విద్యార్థిని పావిత్రి ద్వితీయ స్థానం. జిల్లా కేంద్రంలోని ఏకశిల ఏం జిల్స్ హైస్కూల్ విద్యార్థిని సుష్మకుమారి తృతీయ స్థానం, దంతాలపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థినీ జ్యోత్స్న నాలుగవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి వేదవ్యాస్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్వో అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని సైన్స్ కార్యక్రమాల్లో పాల్గొని భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో నాగమణి, అర్చన, రమేష్‌రెడ్డి, పూర్ణచందర్, మహేష్, రవికుమార్, విజయ్‌రాజ్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైన విద్యార్థి వేదవ్యాస్‌ను అభినందిస్తున్న జిల్లా సైన్స్ అధికారి అప్పారావు

రైతు ఐరీష్ ద్వారా వడ్ల కొనుగోలుకు ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సూచనల మేరకు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నేరుగా రైతు ఐరీష్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సంబంధిత సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వానాకాలం ధాన్యం మద్దతు ధర క్వింటాకు ఏగ్రేడ్‌రకం రూ.2320, సాధారణ రకం రూ.2300, అదనంగా రూ.500 ప్రతీ సన్న ధాన్యానికి చెల్లించబడుతుందని, సన్నరకం క్వింటాకు రూ.2820 చెల్లిస్తారని చెప్పారు. ఈ సంవత్సరం జిల్లాలో ఐకేపీ 64, పీఏసీఎస్ 153, జీసీసీ 11, మెప్మా 02, డీఎఫ్‌పీసీఎల్ 03, ఏఎంసీ 01 వెరసీ మొత్తంగా 234 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం సూచన మేరకు సంబంధిత ఏజెన్సీలు సిబ్బంది రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని అందుకు ఈరోజు మూడు దఫాలుగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, అధికారులు మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, మరియన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్

25, 26న ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల బాల బాలికల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ -19 జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. మొదటి విడతగా 25న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, నెట్ బాల్, కరాటే, లాన్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 26న జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్ క్రీడాంశాలతో పాటు వరంగల్ ఓసిటీలో జూడో పోటీలు ఉంటాయని ఆయన వెల్లడించారు. క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కళాశాలల ప్రిన్సిపల్స్, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలతో పాటు ఒక్కో కళాశాల నుంచి ఒక్కో క్రీడాంశాలలో ప్రతిభ కనబర్చిన ఐదుగురు క్రీడాకారులను ఈ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు శ్యాంప్రసాద్ సెల్ నంబర్లు: 98492 10746 రమేష్, 99633 36559 శంకర్, 80084 69219 విష్ణువర్ధన్, 7386469301 జీవన్, 944 0529916 ప్రశాంత్, 9949271564 అఫ్జల్, 90 10002889 లింగమూర్తి, 9495392299 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నష్కల్ నుంచి హసన్‌పర్తికి రైల్వే బైపాస్ లైన్

భూసేకరణలో రెవెన్యూ అధికారులు

కాజీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడిజిల్లాలో బైపాస్ రైల్వే ట్రాక్ నిర్మించడానికి రైల్వే శాఖ సిద్ధమైంది. నష్కల్ నుంచి హసన్‌పర్తి వరకు బైపాస్ రైల్వే ట్రాక్‌ను నిర్మించేందుకు అన్ని చర్యలు చేపట్టింది. ఇందుకు గాను భూమిని సేకరించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్. వెంకన్న, హనుమకొండ ఆర్డీవో ఎస్. వెంకటేష్‌లకు కేంద్ర రైల్వే శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ నెల 16 నుంచి భూసేకరణ పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ బైపాస్ రైల్వే లైన్ జనగామ జిల్లా చిల్పూర్ మండలం నష్కల్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై కరుణాపురం, పెద్దపెండ్యాల, ఎల్కుర్తి, ధర్మసాగర్, ఉనికిచర్ల, దేవన్నపేట, మడిపల్లి, జయగిరి గ్రామాల మీదుగా హసన్‌పర్తి రైల్వే స్టేషన్ వరకు ఆ ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నారు.

24.5.5 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ ట్రాక్‌పై ప్యాసింజర్ రైళ్ల కు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండేందుకు ప్రస్తుతానికి కేవలం గూడ్స్ రైళ్లను మాత్రమే ఈ ట్రాక్ మీదుగా నడిపించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్

పోలీసులు న్యాయం చేయడం లేదని..

- పోలీస్ స్టేషన్‌లో యువకుడు ఆత్మహత్యాయత్నం
- భార్యాభర్తల మధ్య గొడవలు..
- ఐదుగురిపై కేసు
- జనగామ జిల్లాలో ఘటన

పాలకుర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురైన యువకుడు ఫిర్యాదు చేసినా పోలీసులు న్యాయం చేయడం లేదని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. మంటల్లో కాలుతున్న యువకుడిని పోలీసులు కాపాడేందుకు యత్నించగా, పోలీసులు సైతం గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి పోలీసు స్టేషన్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. మండలంలోని కొండాపురం శివారులోని మేకలతండాకు చెందిన లాకావత్ యాకూబ్, మంగ్లిల కుమారుడు శ్రీనివాస్‌కు ఇదే మండలంలోని నర్సింగపురంతండాకు చెందిన భూక్య భాను, శాంతిల కూతురు సరోజ(రాధిక)తో ఆరు నెలల క్రితం వివాహమైంది. కొంతకాలం పాటు వారి కాపురం సవ్యంగానే సాగగా సరోజ గర్భం దాల్చింది. మూడు నెలల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆ తర్వాత సరోజ పుట్టింటికి వెళ్లగా ఈనెల 16న భాను, శాంతి దంపతులు తమ కుమార్తె సరోజను జనగామలోని చంపక్ హిల్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ ఆస్పత్రికి చేరుకొని కాపురానికి ఎందుకు రావడం లేదని భార్యపై చేయి చేసుకున్నాడు. అత్త, మామలను దూషించాడు. దీంతో వారు జనగామలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడి పోలీసులు పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

దాంతో సరోజ అదేరోజు తన భర్త శ్రీనివాస్‌పై పాలకుర్తిలో ఫిర్యాదు చేసింది. ఆ మరుసటి రోజైన 17న శ్రీనివాస్ పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌కు రాగా సరోజను ఎందుకు కొట్టావంటూ ఆమె బంధువులు శ్రీనివాస్‌ను చితకబాదారు. ఈ ఘటన తర్వాత అక్కడి నుంచి వెళ్లిన శ్రీనివాస్ శుక్రవారం రాధిక బంధువులపై కేసు పెట్టాడు. దాంతో పాటు తన భార్యను కాపురానికి పంపించాలని కోరినందుకు తనపై అత్తవారి తరఫు బంధువులు దాడి చేసి కొట్టారని, పోలీసులు తనకు న్యాయం చేయడం లేదంటూ పోలీస్ స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన ఎస్సై సాయిప్రసన్నకుమార్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ కాపాడేందుకు యత్నించారు. తీవ్ర గాయాల పాలైన శ్రీనివాస్‌ను వెంటనే పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధితుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తనను కొట్టిన వారిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, తనకు న్యాయం చేస్తారన్న నమ్మకం లేకనే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని పేర్కొన్నాడు.

గిరిజన సంఘాల ఆందోళన

బాధితుడు శ్రీనివాస్‌ను కొట్టిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాలకుర్తి ఎస్సై సాయిప్రసన్నకుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ గిరిజన సంఘాలు, బాధితుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు జరుపుల బాలూ నాయక్, లలిత దేవేందర్, మహేందర్ నాయక్, నాగరాజు మాట్లాడుతూ శ్రీనివాస్‌ను అతడి భార్య సరోజ బంధువులు కొట్టారని వారిపై ఫిర్యాదు చేసినా ఎస్సై స్పందించలేదని, అతడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఘటన స్థలానికి చేరుకొని అందుకు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించారు.

ఐదుగురిపై కేసు నమోదు

లాకావత్ శ్రీనివాస్‌ను కొట్టిన కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి మహేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బాధితుడు శ్రీనివాస్‌ను కొట్టిన వారిలో టీఎస్‌కేతండాకు చెందిన గుగులోతు హుస్సేన్, మంగ్లి, నర్సింగపురంతండాకు చెందిన భూక్య మహేష్, వినోద్, చిక్కిలపై కేసు నమోదు చేసినట్లు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.


పీఎస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘాలు, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

బడి నుంచి విద్యార్థిని వెళ్లగొట్టారంటూ..

- తల్లిదండ్రులు, ప్రజా సంఘాల ఆందోళన

జనగామ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చేతబడి చేస్తున్నాడంటూ స్కూలు నుంచి ఓ విద్యార్థిని వెళ్లగొట్టిన సంఘటన జనగామ మండలంలో జరిగింది. ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి, జనగామ మండలంలోని పెంబర్తి జ్యోతిబాపూలే గురుకులం (బచ్చన్నపేట)లో 6వ తరగతి చదువుతున్నాడు. సెప్టెంబరు 17న పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ఆ విద్యార్థి తండ్రి మాట్లాడుతూ పాఠశాలలో ఆహార పదార్థాలలో నాణ్యత లేదని, బోధన సరిగా లేదని నిలదీశాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ 'మీ అబ్బాయి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ తోటి విద్యార్థులను బెదిరిస్తున్నాడు. వచ్చి తీసుకెళ్లండి' అంటూ సెప్టెంబరు 23న ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఆ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో అదే నెల 23న విద్యార్థిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. ఆ తర్వాత దసరా సెలవులు రాగా.. సెలవుల అనంతరం తన కుమారుడిని తిరిగి పాఠశాలకు పంపాలని భావించిన తండ్రి బంధువులు, ప్రజా సంఘాల నాయకులతో ఈనెల 17న ప్రిన్సిపాల్‌ను సంప్రదించాడు. కానీ విద్యార్థిని అనుమతించేందుకు ప్రిన్సిపాల్ అభ్యంతరం చెప్పారు. వారు గురుకులం ఎదుట ఆందోళన చేసి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ చంద్రమౌళిని వివరణ కోరగా ఆ విద్యార్థి తనకు మంత్రాలు, చేతబడులు వస్తాయని చెబుతూ తోటి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. బాధిత విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో, మానసికంగా బాధపడుతున్నాడని భావించి అతడిని ఇంటికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సూచించామన్నారు. సెప్టెంబరు 23న విద్యార్థిని తీసుకెళ్లారని స్పష్టం చేశారు.

కాంట్రాక్ట్ డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపల్లి పూరిగుట్ట, పరకాలలో ఉన్న బస్తీ దవఖానాల్లో ఖాళీగా ఉన్న రెండు డాక్టర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో రూ. 52 వేల వేతనంతో నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన డాక్టర్స్ కాలనీలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంబీబీఎస్ డిగ్రీ కలిగి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టరై 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు.

ఎంజీఎంలో కూలిన పైకప్పు పెచ్చులు


ఊడిన పైకప్పు పెచ్చులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎం ఆస్పత్రిలోని అంకాలజీ విభాగంలో ప్రమాదం తప్పింది. శుక్రవారం అంకాలజీ వార్డులోని భవనం పై పెచ్చులు ఒక్కసారిగా ఊడి కిందపడ్డాయి. ఈ సమయంలో రోగులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ వార్డులో పని చేసే సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కాగా, పురాతన కాలం నాటి బిల్డింగ్ కావడంతో పెచ్చులు ఊడి పడ్డాయని సిబ్బంది భావిస్తున్నారు.

ఆదర్శ లా కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

బాలసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని ఆదర్శ లా కళాశాలలో లాసెట్ ఎంట్రెన్స్ సాధించినవారికి స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ప్రతిభ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లా ఎంట్రెన్స్ సాధించి అర్హత గల అభ్యర్థులు ఈనెల 17 నుంచి 26 వరకు ఆన్‌లైన్ అడ్మిషన్ కోసం అప్లై చేసి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను వేరిఫై చేయించుకొని ప్రిన్సిపాల్ వద్ద రసీదు పొందాలన్నారు.

పిడుగుపాటుతో మహిళా రైతు మృతి


వెంకమ్మ (ఫైల్)

సీరోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం అందనాలపాడు గ్రామంలో మిర్చితోటలో కలుపు తీస్తున్న పోతురాజు వెంకమ్మ (48) అనే మహిళా రైతుపై పిడుగు పాటుతో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో వెంకమ్మకున్న రెండకరాల్లో మిర్చితోటను సాగు చేశారు. అందులో శుక్రవారం ఆమె కలుపు తీస్తుండగా, సాయంత్రం 5 గంటల సమయంలో అకాల వర్షం కురిసింది. ఈ క్రమంలో వెంకమ్మపై పిడుగుపడడంతో మిర్చి తోటలోనే అక్కడికక్కడే మృతి చెందింది. సమీపంలోని పంటపొలాల్లో పని చేస్తున్న వారు అక్కడకు చేరుకుని చూడగా, వెంకమ్మ అప్పటికే మృతిచెంది విగతజీవిగా పడి ఉంది. మృతురాలికి భర్త బాబు, కుమార్తె మాధవి ఉన్నారు.

మూగజీవాల అక్రమ రవాణా

ఐదుగురిపై కేసు నమోదు » డీసీఎం వాహనం, కారు సీజ్

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలను అక్రమంగా రవాణా చేస్తున్న విలేకరితో పాటు మరో నలుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై తాజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని 163వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. వాజేడు మండలం నుంచి ఏటూరునాగారం వైపునకు ఏపీ 16 సీఏ 3656 కారు వేగంగా వస్తూ దాని వెనుకల టీఎస్ 12 వీటీ 4046 నంబర్ గల డీసీఎం వాహనం వచ్చిందన్నారు. డీసీఎంలో 22 మూగ జీవాలు ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మూగ జీవాల రవాణాకు సంబంధించిన పత్రాలు లేవని డ్రైవర్ చెప్పడంతో డీసీఎం, దాని ముందు వచ్చిన కారును స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. ఓ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వ్యక్తితో పాటు మంగపేట మండలం కమలాపురానికి చెందిన ఆత్కూరి రవీందర్, ఏటూరునాగారం మండలం దొడ్ల-కొత్తూరుకు చెందిన జైస్వావత్ కుమార్, ములుగు మండలం జంగాలపల్లికి చెందిన కొడాలి కృష్ణ, ఉచిత శ్రీను ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని, వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. అలాగే పట్టుకున్న మూగజీవాలను గోశాలకు తరలించి డీసీఎం, కారును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎవరినైన ఉపేక్షించేది లేదని ఎస్సై హెచ్చరించారు.


డీసీఎంలో రవాణా చేస్తున్న మూగ జీవాలు ←

ముగిసిన క్వార్టర్స్ కౌన్సెలింగ్

626 మందికి
389 మంది గైర్హాజరు

కాకతీయఖని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా భూపాలపల్లి ఏరియాలో చర్చనీయాంశంగా మారిన క్వార్టర్ల అంశానికి తాత్కాలికంగా తెరపడింది. సింగరేణి అధికారులు బెటర్‌మెంట్ క్వార్టర్ కౌన్సెలింగ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఏరియా అధికారులు 169 క్వార్టర్లను కౌన్సెలింగ్‌లో ఉంచగా 626 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా ఈ కౌన్సెలింగ్‌కు 389 మంది గైర్హాజరైనట్లు సింగరేణి అధికారులు తెలిపారు. మొత్తం 237 మంది కౌన్సెలింగ్‌కు హాజరుకాగా 135 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. 102 మంది అనాసక్తి చూపారని తెలిపారు. 169 క్వార్టర్లకు 135 కేటాయించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన 35 క్వార్టర్లకు త్వరలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

కార్మిక సంఘం నాయకులను ప్రశ్నించిన కార్మికులు

క్వార్టర్ల కేటాయింపు విషయంలో కార్మిక సంఘం నాయకులను కార్మికులు ప్రశ్నించారు. సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పని చేసే కార్మికులకు కాదని ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులకు ఇస్తుంటే మీరేం చేస్తున్నారని వాగ్వివాదానికి దిగారు. ఖాళీ క్వార్టర్లను అన్నింటిని కౌన్సెలింగ్‌లో పెట్టకుండానే పాతవాటికి మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహించడంలో అంతర్యమేమిటని నిలదీశారు.


బెటర్‌మెంట్ క్వార్టర్స్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు

వాయిదా వేయడం ఎందుకు ?

అధికారులు 171 క్వార్టర్లకు ఈ నెల 7న బెటర్‌మెంట్ కౌన్సెలింగ్ నిర్వహించగా కార్మిక సంఘాల నాయకులు ఖాళీ క్వార్టర్లను అన్నింటిని కౌన్సెలింగ్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఏరియాలో ఎన్ని క్వార్టర్లు ఉన్నాయో అవి ఎవరికి కేటాయించారో పూర్తి వివరాలను నోటీసు బోర్డులో ఉంచితేగాని కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వీలు లేదని భైఠాయించారు. వారికి మద్దతుగా కార్మికులు నిలిచారు. దీంతో అధికారులు కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. తిరిగి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే మొదటి దఫాలో 171 క్వార్టర్లను కౌన్సెలింగ్‌లో ఉంచినప్పుడు వాయిదా వేయించిన కార్మిక సంఘాల నాయకులు తిరిగి నిర్వహించే కౌన్సెలింగ్‌లో 169 క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంటే కార్మిక సంఘాల నాయకులు ఎలా ఒప్పుకున్నారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఆ మాత్రం దానికి ఈ నెల 7న కౌన్సెలింగ్‌ను సక్రమంగా జరగనిస్తే తమకు ఓ మస్టర్ కలిసి వచ్చేది కదా అని చర్చించుకుంటున్నారు. కొందరు నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం కార్మికుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని అంటున్నారు. ఇప్పటికైనా వ్యక్తిగత ప్రయోజనాలు మానుకుని కార్మికుల సమస్యలపై పోరాడాలని డిమాండ్ చేస్తున్నారు. ఏరియా రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, రవికుమార్, మారుతి, రాజు, క్రాంతి, శివకుమార్, సాయికృష్ణ, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న పోలీసులు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- 20.9 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్ సమీపంలో అంతర్రాష్ట్ర గొలుసుదొంగ ఆంగోత్ విక్రమ్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి 20.9 తులాల బంగారు ఆభరణాలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఎస్పీ జోగుల చెన్నయ్య పర్యవేక్షణలో డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో టౌన్, సీసీఎస్ పోలీసులు నాలుగు బృందలుగా ఏర్పడి వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టణ శివారు ఆర్తి గార్డెన్ వద్ద ఆంగోత్ విక్రమ్ పట్టుబడినట్లు తెలిపారు. బయ్యారం మండల కేంద్రానికి చెందిన విక్రమ్ డ్రిల్లింగ్ మిషన్ వర్కు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని, తల్లిదండ్రులతో కలిసి 2023 వరకు ఖమ్మంలో నివసించేవారని తెలిపారు.

ఆ తర్వాత ఖమ్మం నుంచి తల్లిదండ్రులు గార్లకు వచ్చారని తెలిపారు. విక్రమ్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలయ్యాడని పేర్కొన్నారు. ఫేస్‌బుక్‌లో చైన్‌స్నాచింగ్ సీన్లను చూసి అలా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఏడాది నుంచి తన తండ్రి బైక్‌పై ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ఏరియాల్లో తిరుగుతూ ఒంటరిగా వెళ్లే మహిళల మెడలో ఉన్న ఆభరణాలు లాక్కొని వెళ్లేవాడు. విక్రమ్‌పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. నిందితుడిని పట్టుకున్న సీఐలు పెండ్యాల దేవేందర్, హతిరాంనాయక్, ఎస్సైలు తాహెర్‌బాబా, విజయ్‌కుమార్, పీసీలు నరేష్, బాలు, మధుసూదన్‌రెడ్డికి రివార్డులతో అభినందించినట్లు తెలిపారు.

గూడూరు బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తా

మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్


గూడూరు బస్టాండ్‌ను పరిశీలిస్తున్న బలరాంనాయక్

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్‌ను అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తానని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ అన్నారు. గూడూరు బస్టాండ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రయాణీకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బస్టాండ్ ఆవరణలో సీసీ ఫ్లోర్ చేయించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్లో మాట్లాడారు. కేబుల్ తండాలో మంజూరైన అభివృద్ధి పనులపై ఈఈ వీరభద్రంతో ఫోన్లో మాట్లాడారు. త్వరితగతిన పనులు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు యాకూబ్‌పాషా, అమరేందర్‌రెడ్డి, చల్లా వెంకటరెడ్డి, కన్నెబోయిన వెంకన్న, మండల మల్లేష్, పెసరు శివ, హెచ్.శివ, ఆవుల అశోక్ ఉన్నారు.

గురుకులాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న యశస్వినిరెడ్డి

తొర్రూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరులోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ గురుకులాలను ఏర్పాటు చేస్తుందని, ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఆయా జిల్లాల్లో శంకుస్థాపనలు చేశారని, పేద విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందుతుందన్నారు. గురుకులాల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయన్నారు. మెనూ ప్రకారమే భోజనం అందించాలని, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థినులు ఒకేదగ్గర ఉంటున్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పార్టీ కార్యకర్తల కు టుంబీకులను పరామర్శించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో తొర్రూరు, పెద్దవంగర మండలాలకు చెందిన 24 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంచు సంతోష్, సోమరాజశేఖర్, రాంచంద్రయ్య, సురేందర్ రెడ్డి, దొంగరి శంకర్, బిజ్జాల అనిల్, ముద్దసాని సురేష్, శ్రీనివాస్, వెంకన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిల్లును నమ్మి మోసపోయాం

డబ్బులు ఇప్పించాలని రైతుల ఆందోళన

చిట్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పత్తి మిల్లులో విక్రయించిన డబ్బులతో పాటు యాజమానికి ఇచ్చిన డబ్బులు ఇవ్వడంలేదని జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ పత్తిమిల్లు ఎదుట సుమారు 50మంది రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మండల కేంద్రంలోని కాకతీయ కాటన్ ఇండస్ట్రీస్ యాజమానికి పత్తి విక్రయించిన డబ్బులతో పాటుగా సుమారు రూ. 4కోట్ల వరకు అప్పులు ఇవ్వడం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాలుగా యాజమానిని అడిగితే వాయిదాలు వేస్తున్నాడని తెలిపారు. కాగా స్థానిక యూనియన్ బ్యాంకులో తాకట్టులో ఉన్న మిల్లును వేలంపాటలో రూ. 3.07 కోట్లతో మరో వ్యాపారి మార్కెట్ ధర కంటే తక్కువకు కొనుగోలు చేశాడని ఆరోపించారు. ఇద్దరు వ్యాపారుల చేతిలో మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ధర్నా సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ సిబ్బందితో కలిసి మిల్లు వద్దకు చేరుకుని రైతులు, వ్యాపారులతో మాట్లాడారు. రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని, రైతులను ఇబ్బందులకు గురి చేసే వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. నిరసన కార్యక్రమంలో రైతులు ఆకుల రవీందర్, గోపగాని సదానందం, కోడెల రవీందర్, పబ్బ రవి, అల్లం లక్ష్మి, ర్యాకం భాగ్యమ్మ, గుమ్మడి నర్సింహరాములు, యాదమ్మ, నర్సింహారెడ్డి, సదాశివరావు, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.


చిట్యాల పత్తి మిల్లు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కాడెడ్లు.. కనుమరుగాయె..

- వ్యవసాయంలో కానరాని కర్రనాగళ్లు, ఎద్దులబండ్లు
- యాంత్రీకరణతో అదను తప్పుతున్న వ్యవసాయం


నర్మెటలో పొగాకు పంటలో కాడెడ్లతో గొర్రు తోలుతున్న రైతు

నర్మెట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒక నాడు కాడెడ్లు, కర్రనాగళ్లతో కళకళలాడిన కర్షక లోగిళ్లు నేడు కళ తప్పాయి. కాయకష్టంతో సిరులు పండించిన కాడెడ్లు కనుమరగయ్యాయి. నేలలో నుంచి రత్నాలు పండించిన నాగళ్లు దూలాలెక్కుతున్నాయి. పుట్లకొద్ది ధాన్యాన్ని ఇంటికి చేర్చిన ఎద్దులబండ్లు మూలన మూలుగుతున్నాయి. ఫలితంగా పశువులు, ధాన్యపు బస్తాలతో కళకళలాడల్సిన అన్నదాతల ఇళ్లు కళ తప్పిపోయాయి. కంటి రెప్పలా కాపాడుకున్న ఎడ్లన్నీ కండ్లల్లో మెరుస్తున్నాయి. కర్రనాగళ్లతో దున్నిన నేల తల్లిని కర్రు నాగళ్లు దున్నే కాలం వచ్చింది. ఎడ్లు లేని ఎవుసం చేస్తూ అచ్చిరాని యాంత్రిక యుగంలో యంత్రాలతో దున్నకాలు సాగిస్తున్నారు. ఎద్దు ఏడిసిన ఎవుసం, రైతు ఏడిసిన రాజ్యం నిలబడదనేది జగమెరిగిన సత్యం. యాంత్రీకరణ కారణంగా సంప్రదాయ పంటలు పోయి అన్నదాతలు అప్పుల పాలై ఉన్నదంత తెగనమ్ముకుంటున్నారు. పొట్టకూటి కోసం తాతముత్తాల నుంచి వచ్చిన పంట భూములను, పసిడి సొమ్ములను తాకట్టు పెడుతున్నారు. ఉదాహరణకు నర్మెట మండలంలోని పదిహేడు గ్రామాల్లో సుమారు 25 వేల వరకు జనాభా ఉండగా అన్ని గ్రామాల ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారే. పూర్వ కాలం నుంచి ప్రతి ఇంటికి ఎంతో కొంత భూమి ఉంది. ఎకరం మొదలుకొని 15 లేదంటే 20 ఎకరాలున్న రైతులు కూడా ఉన్నారు. నాడు ఈ భూములు సాగు చేయాలంటే ఎద్దుల జోడు తప్పనిసరి. కొందరి ఇళ్లలో అయితే మూడు నాలుగు ఎద్దుల జతలుండేవి. అలాంటి ఇప్పుడు కాడెడ్లు కలిగిఉన్న రైతుల సంఖ్యను వేళ్లమీద లెక్క పెట్టొచ్చు. గతంలో పొలం దున్నడం, నాట్లు వేయడం, కుప్ప కొట్టడం, పంట అనంతరం వచ్చిన ధాన్యాన్ని ఇంటికి చేర్చడం ఇలా ప్రతి ఒక్కటి ఎద్దులు, నాగళ్లు, బండ్ల ఆధారంగానే జరిగేవి. ఎక్కడైన పెళ్లి, పేరంటాలు, బంధువుల వద్దకు వెళ్లాలన్నా ఎడ్ల బండ్ల పైనే వెళ్లేవారు. ఇప్పుడు అంతా యాంత్రికమైంది. పొలం దున్నేందుకు ట్రాక్టర్లు, నాట్లు వేసేందుకు, కలుపు తీసేందుకు, పంట నూర్పిడికి మిషన్లు వచ్చాయి. చివరకు పురుగుల మందులను కూడా యంత్రాలతోనే పిచికారి చేసే పరిస్థితికి వచ్చింది.


మూలన పడ్డ ఎడ్ల బండి కమ్ములు


మూలన పడ్డ ఎద్దుల బండి పట్టాలు

కనిపించని పండగల కళ..

ఒకప్పుడు ఉగాది, దసరా, సంక్రాంతి పండుగ వచ్చిందంటే రైతులంతా తమ ఎద్దులు, పశువులను చెరువులకు తీసుకెళ్లి వాటిని శుభ్రంగా కడిగి పోటీ పడిరంగులు చల్లి అలంకరించే వాళ్లు. రంగు రంగు కాగితపు తోరణాలు, మామిడి, కొబ్బరి, అరటి ఆకుల తోరణాలతో ఎద్దులబండ్లను అలంకరించి గ్రామాల్లో తిప్పేవారు. దేవాలయాలు, పుణ్యక్షేత్రాలను చుట్టూ ప్రదక్షిణలు చేయించే వారు. కానీ ఇప్పుడివేమీ లేవని నాటి తరం వరం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కదిలిస్తే కన్నీరే..

గ్రామాల్లో రైతన్నలను కాడెద్దుల గురించి కదిలిస్తే కన్నీటి పర్యంతమవుతున్నారు. గతంలో తమ జీవనాధారం కాడెడ్లేనని, వాటితో పొలాలు దున్ని, కుప్పలు నూర్పి, బండ్లపై పంటను ఇంటికి చేర్చుకునే వారమని గుర్తు చేసుకుంటున్నారు. రాను రాను వర్షాలు పడక, సరిపడా మేత లేక, వాటిని ఉపవాసం ఉంచలేక అమ్ముకున్నాం. దానికి తోడు కూలీల కొరత. యంత్రాలు రావడం కూడా కారణమని చెబుతున్నారు.

ఎడ్లున్నప్పుడే ఎవుసం బాగుండే

- ప్రజ్ఞాపురం కనకయ్య, నర్మెట



ఎడ్లున్నప్పుడు వ్యవసాయం అదనుమీద జరిగేది. కాడెడ్లు పోయి యంత్రాలు వచ్చినా ఏ పని అదనుమీద జరగడం లేదు. కాడెడ్ల వ్యవసాయంతో భూసారంతో పాటు పంట ఉత్పత్తి బాగా ఉండేది. యంత్రాలు వచ్చినప్పటి నుంచి దున్నకాలు మాత్రమే త్వరగా జరుగుతున్నాయే తప్ప పంట అంతరకృషి మాత్రం అదునుగా లేదు. యంత్రాలతో పెట్టుబడి పెరిగింది. రైతు మీద మరింత భారం పడుతోంది. రైతు శ్రమైక జీవనంలో కాడెడ్లు ఇమిడి ఉండేవి. నేడు అవి కనుమరుగయ్యాయంటే బాధేస్తోంది.

ఎన్నో వివాదాలు.. మరెన్నో సమస్యలు..

ఆర్థిక ఇబ్బందులకు తోడు విద్యార్థుల ఆందోళనలతో కేయూ సతమతం

కొత్త వీసీ ప్రతాప్‌రెడ్డికి సమస్యల స్వాగతం

ప్రక్షాళనపై అందరిలోనూ ఆశలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 18: (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా కాకతీయ యూనివర్సిటీకి ఎంతో పేరుంది. అలాంటి వర్సిటీ కొన్నేళ్లుగా పలు వివాదాలు, సమస్యలతో పాటు నిర్వహణ లోపాలు, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బ్లాక్ గ్రాంట్ సక్రమంగా రాకపోవడంతో ఉద్యోగులకు జీతాలు సరైన సమయంలో ఇవ్వలేదని దుస్థితిలో ఉంది. వీటితో పాటు వర్సిటీ ఇప్పటి వరకు వైస్‌చాన్స్‌లర్లుగా పనిచేసిన ప్రొఫెసర్లు తీవ్ర వివాదాల్లో ఇరుక్కోవడం, ఎవరికి వారే వారే యమున తీరే అన్న రీతిన వ్యవరించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని పరిపాలనా పరంగా వ్యవస్థాగత పరంగా అనేక వివాదాలను సృష్టించారు. చివరకు వర్సిటీలో పనిచేయాలంటే 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' అని భయపడేంతగా పరిస్థితి మారింది. వర్సిటీలో శాంక్షన్ పోస్టుల కంటే తక్కువ మంది ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో క్లాస్ వర్క్ సరిగ్గా జరుగక విద్యార్థులు పాఠాలకు నోచుకోవడం లేదు. కోర్సులు పూరైన తరువాత పీహెచ్‌డీ చదువుకుందామంటే అర్హులైన ప్రొఫెసర్లు లేకపోవడంతో పర్యవేక్షకుల కొరత ఏర్పడుతోంది. దీంతో పీహెచ్‌డీ అడ్మిషన్లు ఇవ్వలేదని పరిస్థితి ఉంది. వర్సిటీ కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులున్నా వారికి పాఠాలు చెప్పడంతోనే సరిపోతోంది. వర్సిటీలో ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ చేపట్టకపోతే రానురాను ఇబ్బందులు తప్పవు. ఇప్పుడున్న 78 మంది ప్రొఫెసర్లు రిటైరైతే వర్సిటీ భవిష్యత్ పరిస్థితి ఎంటనే ప్రశ్నార్థకంగా మారింది. బోధన సిబ్బందితో పాటు బోధనేతర సిబ్బందిని నియామించాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో శనివారం కొత్త వీసీగా బాధ్యతలు చేపడుతున్న ప్రభాకర్‌రెడ్డి ప్రక్షాళన చేసి వర్సిటీ నిర్వహణను గాడిన పెడతారని అందరూ ఆశిస్తున్నారు.

వర్సిటీ భూముల రక్షణకు చర్యలు..

వర్సిటీ భూముల వ్యవహారం వర్సిటీలో కలకలంగా మారింది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులే ఉన్నతాధికారులు, పాలక మండలి సభ్యులను సైతం పక్కాదారి పట్టించి తమకు అనుకూలంగా వర్సిటీ భూములను అందినకాడికి దండుకునే ప్రయత్నాలకు దిగారు. వర్సిటీ ప్రొఫెసర్ల సంఘం జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీతో పాటు వర్సిటీ విద్యార్థి నేతలు, ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వానికి తగిన పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దీంతో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వర్సిటీ భూముల రక్షణకు చర్యలు చేపడుతామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి.. ఆ ప్రకారం అధికారంలోకి రాగానే చర్యలు చేపట్టారు. అయితే అడుగుఅడున అధికారుల సర్వేలకు అడ్డుతగులుతూ వివాదాలకు దిగుతున్నారు. వర్సిటీ ప్రహరీ నిర్మాణ పనులు ఎక్కడవక్కడే నిలిచిపోయాయి. వీటితో పాటు వర్సిటీ పోలీస్ స్టేషన్ పక్కన సీఆర్‌పీఎఫ్ క్యాంప్ కోసం కేటాయించిన భూములను పోలీసు అధికారులు దక్కించుకునే ప్రయత్నాలకు దిగారు. దీన్ని విద్యార్థులు, వర్సిటీ ఉద్యోగులు అడ్డుకున్నారు.

గత వీసీ తాటికొండ రమేశ్‌పై ఎంక్వైరీలు

మే 21 వరకు కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా కొనసాగిన తాటికొండ రమేశ్‌పై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. వీటన్నిటిపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పోలీసుల ఎంక్వైరీ ముమ్మరంగా సాగుతోంది. ప్రధానంగా వీసీ రమేశ్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని వర్సిటీలో అక్రమంగా డబ్బులు దండుకుని అడ్హక్ ప్రొఫెసర్ల నియామకం, న్యాక్ పేరుతో విచ్చలవిడిగా నిధులను పక్కదారి పట్టించారనే ఆరోపణలున్నాయి. అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లలో తనకు ఇష్టం వచ్చిన వారికి సీట్లు ఇచ్చేందుకు నిబంధనలను తుంగలో తొక్కారని తేల్చారు. కేటగిరి-1, 2లో ఇష్టానుసారంగా సీట్లను కేటాయించి ఇన్‌సర్వీస్ వారికి మధ్యవర్తులను పెట్టుకుని వసూళ్లకు పాల్పడ్డారని విద్యార్థులు ఫిర్యాదులు చేశారు. పీహెచ్‌డీ సీట్లలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో గొడవ చేశారు. దీంతో పోలీసుల విద్యార్థుల పట్టుకుని తీవ్రంగా కొట్టారు. పీహెచ్‌డీ సీట్లు దక్కకపోగా తమపై పోలీసులు అకారణంగా వీసీ రమేశ్ పోద్బలంతో దాడులు చేశారని విద్యార్థులు దూరవిద్య కేంద్రం వద్ద టెంటు వేసుకుని నిరసన ఆందోళనలు చేపట్టారు. అదే విద్యార్థులపై పోలీసుల దాడుల నేపథ్యంలో వర్సిటీలో పెద్ద ఎత్తున గొడవ జరిగింది. అప్పట్లో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను పరామర్శించారు.



ఇతర వివాదాలు, సమస్యలు..

- కేయూ పరీక్షల విభాగం అనేక వివాదాలను ఎదుర్కొంటోంది. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో విద్యార్థులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఏటేటా మారుతున్న పరీక్షల విధానాలల్లో మార్పులతో పరీక్షల విభాగంపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఉద్యోగులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పరీక్షల విభాగంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. పరీక్షల విభాగంలో అవినీతికి పాల్పడిన ఉద్యోగులను ఇటీవల విధుల నుంచి తొలగించారు.
- వర్సిటీలోని కొందరు ఉద్యోగులు అసంతృప్తిగా పనిచేస్తున్నారు. ఏళ్లుగా చాలీచాలనీ వేతనాలతో పని చేస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. గత వీసీ హయాంలో కొందరు రెగ్యులర్ ఉద్యోగులకు పీఆర్‌సీ చెల్లించలేదని వారు ఇప్పటికీ రాష్ట్ర ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ వినతి పత్రాలను ఇచ్చి తమకు కొత్త పీఆర్‌సీని అమలు చేయాలని కోరుతున్నారు.
- యూనివర్సిటీ మెస్‌లు వివాదాల కుంపటిగా మారాయి. మెస్‌లో అస్తవ్యస్త విధానాలు అమలు చేస్తుండంతో అధికారులకు విద్యార్థులు చుక్కలు చూపిస్తున్నారు. కాంట్రాక్టరు నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల పాల కాంట్రాక్టరు నుంచి అక్రమంగా డబ్బుల తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఏఆర్‌ను పట్టుకున్నారు. మెస్‌లను గాడిన పెట్టల్సిన అవసరం ఉంది. భోజనంలో నాణ్యతలేదని విద్యార్థులు నిత్యం ఆందోళనలకు దిగుతున్న సందర్భాలున్నాయి.
- ఏటేటా వర్సిటీలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దానికి అనుగుణంగా నూతన హాస్టళ్ల ఏర్పాటు చేసినప్పటికీ విద్యార్థులకు సరిపోవడం లేదు. ఇటీవల పోతన హాస్టల్‌లో విద్యార్థులు తమకు సరైన సదుపాయాలు లేవని ఆందోళనలు చేపట్టారు. రిజిస్ట్రార్‌తో పాటు హాస్టల్ డైరెక్టర్‌ను నిర్బంధించారు. పోతన హాస్టల్‌లో పీజీ విద్యార్థిపై ఫ్యాన్ ఊడిపడి గాయాలపాలయ్యారు. విద్యార్థులపై స్లాబ్ పెచ్చులు పడి గాయపడిన సంఘటలున్నాయి.
- వర్సిటీలో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రారంభించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు మంచి ఉద్యోగాలు రావాలంటే మంచి కోర్సులను అభ్యసించాల్సిన అవకాశం ఉంది. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు ఆందోళనలు చేపడుతున్నారు.
- విద్యార్థులను క్లాస్‌లకు రప్పించేందుకు పాఠాలు చెప్పించేందుకు పక్కా ప్రణాళికలు లేవు. విద్యార్థులకు, అధ్యాపకులు బయో మెట్రిక్ హాజరును తప్పనిసరి చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. క్లాస్ వర్క్‌లేకపోతే వర్సిటీలో విద్యార్థులు గాడితప్పుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్లాస్‌వర్క్ కోసం నూతన వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సంస్కరణ తీసుకురావాల్సిన అవసరం వుంది.

కేయూ వీసీగా ప్రతాపరెడ్డి

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకమైన కాకతీయ యూనివర్సిటీ కొత్త వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని తొమ్మిది వర్సిటీలకు వైస్ చాన్స్‌లర్లను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయగా.. కేయూకు ప్రతాప్‌రెడ్డిని నియమించారు. సెర్చ్ కమిటీ సిఫార్సులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీ జంతుశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయన కాకతీయ యూనివర్సిటీకి 13వ నూతన వైస్ చాన్స్‌లర్‌గా శనివారం బాధ్యతలు చేపట్టనుండగా ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

విద్య, ఉద్యోగ ప్రస్థానం

1961 జూన్ 15న జన్మించిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో బీఎస్సీ 1981లో డిగ్రీలో డిస్టెన్షన్, 1983లో ఎంఎస్సీ ప్రథమ శ్రేణీలో ఉత్తీర్ణత సాధించారు. అలాగే 1988లో ఉస్మానియా వర్సిటీ నుంచి న్యూరో బయోలజీ ఏరియాలో పీహెచ్‌డీ సాధించారు. 1989 జూన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి 1998లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2006లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు

పరిపాలన పదవులు..

1989లో ఉస్మానియా వర్సిటీలో ప్రొఫెసర్‌గా నియమితులైన ప్రతాప్‌రెడ్డి 32 బోధన, పరిశోధన అనుభవం ఉంది. అలాగే ఓయూ రిజిస్ట్రార్‌గా డీన్‌గా, ప్రిన్సిపాల్, ఓయూ జంతుశాస్త్ర విభాగం, బోర్డు ఆఫ్‌స్టడీస్ ఛైర్మన్, సీడీసీ ఇన్‌చార్జి డీన్, డైరెక్టర్ అకాడమిక్ డీన్, డైరెక్టర్ అడ్మిషన్స్ డైరెక్టరేట్, జాయింట్ డైరెక్టరైట్ అడ్మిషన్స్, కో ఆర్డినేటర్ ఎడ్‌సెట్-2008లతో పాటు వివిధ పరిపాలన, పరిపాలనేతర హోదాల్లో సమర్థవంతంగా పనిచేశారు.

అకాడమిక్ అచీవ్‌మెంట్స్..

ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో 28 మంది పీహెచ్‌డీలు సాధించారు. 12 యూజీసీ న్యూఢిల్లీతో పాటు ఇతర మేజర్ రిసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు. 105 పరిశోధనాత్మక వ్యాసాలను ప్రచురించారు.

మరో రెండు వర్సిటీలకు వీసీలుగా కేయూ ప్రొఫెసర్లు

తెలంగాణ వర్సిటీకి యాదగిరిరావు, మహాత్మాగాంధీ వీసీగా అల్తాఫ్‌హుస్సేన్



టి.యాదగిరిరావు, అల్తాఫ్ హుస్సేన్

కాకతీయ యూనివర్సిటీ నుంచి మరో ఇద్దరు ప్రొఫెసర్లు రాష్ట్రంలోని రెండు వర్సిటీలకు వైస్ చాన్స్‌లర్లుగా నియమితులయ్యారు. కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఎంహెచ్‌ఆర్ఎం విభాగం సీనియర్ ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరి రావు, ఫిజిక్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ ఆ జాబితాలో ఉన్నారు. నిజామాబాద్‌లోని తెలంగాణ వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ యాదగిరి రావు, నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీగా అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. వీరిలో యాదగిరిరావు సర్వీస్‌లో ఉండగా అల్తాఫ్ హుస్సేన్ ఉద్యోగ విరమణ పొందారు.



కష్టాన్ని మరిచి.. పొలం గట్టే తివాచీ..

ఎండనక.. వాననక.. కాయకష్టం చేస్తుంటారు రైతులు, రైతు కూలీలు. ఉదయాన్నే సద్ది కట్టుకుని పొలం బాట పడతారు. అందరూ కలిసి మాట కలుపుతూ.. పదం పాడుతూ శ్రమిస్తుంటారు. మధ్యాహ్నం సమయంలో పొలం గట్టునే తివాచీగా చేసుకుని ముచ్చట్లు చెప్పుకొంటూ.. బాగోగులు పంచుకుంటూ ఇదిగో ఇలా కష్టాన్ని మరిచి సహపంక్తి భోజనం చేస్తారు. జయశంకర్ భూపాలపల్లి మల్హర్‌లో శుక్రవారం మధ్యాహ్నం కొందరు మహిళలు అప్పటి వరకు పొలం పనులు చేసి.. పొలంగట్టున ఒక్కటిగా కూర్చుని కబుర్లు చెప్పుకొంటూ భోజనం చేస్తూ కనిపించారు.

- మల్హర్

కాకతీయ సంస్కృతి, సంపదను భావితరాలకు అందించాలి

- రేచర్ల రుద్రసేనాని విశ్వాసానికి, శౌర్యానికి ప్రతిరూపం రామప్ప
- వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల శిక్షణలో ప్రొఫెసర్లు సుదర్శనరావు, గోవిందరాజు

రామప్ప వెంకటాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటు తెలంగాణ ప్రాంతాన్ని, అటు ఆంధ్ర ప్రాంతాన్ని కలిపి పరిపాలించిన కాకతీయులు కాలం నాటి సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని న్యూఢిల్లీ ఐసీహెచ్ఆర్ మాజీ చైర్మన్, ప్రొఫెసర్ వై.సుదర్శనరావు, టూరిజం ప్రొఫెసర్ డాక్టర్ గోవిందరాజు పేర్కొన్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల శిక్షణలో శుక్రవారం వారు పాల్గొన్నారు. కాకతీయుల పాలన, సంస్కృతి శ్రేయస్సు అనే అంశంపై మాట్లాడిన వారు.. రేచర్ల రుద్రసేనాని విశ్వాసానికి, శౌర్యానికి ప్రతిరూపం రామప్ప అని, అంతర్జాతీయ పర్యాటక సమాజాన్ని ఆకర్షించేలా రామప్పలో అభివృద్ధి పనులతోపాటు ఇంకా ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. అలాగే ఆర్థిక వ్యవస్థపై టూరిజం అనే అంశంపై ఎన్ఐటీహెచ్ఎం మాజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవిందరాజు ప్రసంగించారు. అనంతరం వలంటీర్లు రామప్ప పరిసరాల్లోని గొల్లాలగుడి, శివాలయం సందర్శనకు వెళ్లారు. ఈ శిక్షణకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన వలంటీర్ల అనుభవాలు వారి మాటల్లో.



శిక్షణలో వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న మాజీ ప్రొఫెసర్ గోవిందరాజు


శిక్షణలో పాల్గొన్న వలంటీర్లు

రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలి : జ్ఞానకళ, నంద్యాల, ఆంధ్రప్రదేశ్



నేను ఆంధ్రప్రదేశ్ జిల్లా నంద్యాల జిల్లా సిటీ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ టూరిజం హాస్పిటాలజీ మేనేజ్‌మెంట్(బీబీఏటీటీఎం) చేస్తున్నా. వరల్డ్ హెరిటేజ్ సంస్థ ఏర్పాటు చేసిన శిక్షణలో భాగంగా రామప్పకు వచ్చా. రామప్పకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఇంత ప్రాచుర్యం పొందిన దేవాలయమని శిక్షణలో తెలుసుకున్నా. ఇక్కడి సాండ్‌బాక్స్ టెక్నాలజీ పూర్వీకుల మేధస్సుని తెలుసుకుని ఆశ్యర్యపోయా. ప్రతీ ఇంట్లో రామప్ప దేవాలయం చిత్రపటం ఉండాల్సిన అవసరం ఉంది.

రామప్ప కళా సంపద అద్భుతం : పూనెం జాన్వి, పర్యాటక విద్యార్థి



మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. నేను కాకతీయ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్ (ఎంఏఎంటీఎం) చేస్తున్నా. నేను ఎప్పుడూ ఇలాంటి అద్భుతమైన కళాసంపద చూడలేదు. శిల్పకళ అమూల్యం, అనిర్వచనీయం. నాకు ఈశిక్షణ భవిష్యత్‌లో చాలా ఉపయోగపడుతుంది.

కళా సంపదపై పరిశోధనలు జరగాలి : ఎస్.సంజయ్, తమిళనాడు



తమిళనాడు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో ఆర్కియాలజీలో పీహెచ్‌డీ చేస్తున్నా. నా చిన్నతనంలో కాకతీయ కట్టడాల గురించి ఎవరూ చెప్పలేదు. ప్రొఫెసర్ పాండు రంగారావు ఆధ్వర్యంలో ఇలాంటి శిల్పకళా సంపదపై పరిశోధన చేస్తున్నా. వారసత్వ సంపద పరిశోధనలు చేసేవిధంగా ప్రోత్సాహకాలు అందించాలి. అప్పుడే వాటి గొప్పతనం పుస్తకాల రూపంలో భావితరాలకు అందించగలం. చరిత్ర అనేది భవిష్యత్తుకు మార్గాన్ని చూపిస్తుంది. కాకతీయకాలం నాటి సాంకేతికత నేటి తరానికి ఆదర్శవంతం.

రామప్పకు రావడం అదృష్టం : పసుల రమ్యశ్రీ - జియాలజిస్ట్, వరంగల్



వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో జువాలజిస్ట్‌గా చేస్తున్నా. రామప్ప ఆలయంలో నంది, శివలింగాల కోసం బ్లాక్‌స్టోన్ వాడారు. ఇది డోలరైట్ రాయి అని ఈశిక్షణలో తెలుసుకున్నా. ఈరాయి హార్డ్‌నెస్ 7 ఉంటుంది. ఇలాంటి రాయిని నేను ఎక్కడా చూడలేదు. నా జీవితంలో రామప్ప శిక్షణ మధుర అనుభూతిగా మిగిలిపోతుంది. ములుగు జిల్లాలో ఎర్రరాయి ఉండడం వల్ల రామప్ప మొత్తం ఎర్రరాయితో నిర్మించారని తెలుసుకున్నా.

గ్రూప్ డిస్కషన్స్‌తో మేధస్సు పెంపు

డాక్టర్ సూర్యకిరణ్, టూరిజం ప్రమోటర్



వివిధ ప్రదేశాలకు చెందిన పర్యాటక విద్యార్థులు ఒకచోట చేరి అనుభవాలను పంచుకోవడం మేధస్సు ద్వారా పెరుగుతుంది. మరిన్ని నూతన ఆవిష్కరణలకు పునాది అవుతుంది. పరిశోధక విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అనుమానాల నివృత్తి ఆనందంగా ఉంది

జనగాం శ్రీధర్‌రావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు, శిక్షణ కోఆర్డినేటర్



ఈశిక్షణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వలంటీర్లు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం సంతృప్తికరంగా ఉంది. అనేక విషయాలు కూడా మేము వారి వద్దనుంచి నేర్చుకుంటున్నాం. గత మూడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రామప్ప సర్వతో ముఖాభివృద్ధికి ఇలాంటి శిక్షణ దోహదపడుతుంది.

పురాతన ఆంజనేయస్వామి విగ్రహం లభ్యం


లభ్యమైన పురాతన ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం

న్యూశాయంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్ అభయాంజనేయస్వామి కాలనీలోని అభయాంజనేయస్వామి గుడి వెనక ప్రాంతంలో శుక్రవారం పురాతన ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం లభ్యమైంది. ఇక్కడ ఉన్న బండరాళ్లను తొలగిస్తుండగా పురాతన విగ్రహం బయటపడినట్లు కాలనీ ప్రజలు తెలిపారు. దీంతో కాలనీకి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆంజనేయస్వామి విగ్రహం ఎదుట కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అయితే ఈ నెల 12వ తేదీన దసరా పండుగ రోజు రావణాసుర వధ కార్యక్రమం ఈ స్థలంలోనే ఏర్పాటు చేయగా అప్పుడు ఎలాంటి విగ్రహం కనపడలేదని, శుక్రవారం సడన్‌గా విగ్రహం ఎలా బయటపడిందని అభయాంజనేయ స్వామి కాలనీకే చెందిన కొంత మంది ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

‘మతోన్మాద భావజాలంపై పోరాటం చేయాలి’



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

కేసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధికి అవరోధంగా మారిన మతోన్మాద భావజాలంపై కమ్యూనిస్టులు ఐక్య పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేసముద్రం హరిహరగార్డెన్స్‌లో శుక్రవారం పార్టీ మండల మహాసభ చాగంటి కిషన్, గొడిశాల వెంకన్న, అల్లుగొండ సావిత్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ మూడోసారి గద్దెనెక్కిన మోదీ సర్కారు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఈ హామీలను అమలు చేయకుండా మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, అలువాల వీరయ్య, మార్తినేని పాపారావు, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, మోడెం వెంకటేశ్వర్లు, కావటి నర్సయ్య, తాడబోయిన శ్రీశైలం, జల్లె జయరాజ్, ఆవుల వెంకన్న పాల్గొన్నారు.

‘హామీలను అమలు చేయాలి’

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలోఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచ తప్పకుండా అమలు చేయాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని పాతకలెక్టర్ ఆఫీస్ ఏరియా కాలనీ సీపీఎం శాఖ సమావేశాన్ని శుక్రవారం గాడిపెల్లి సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో హామీలిచ్చి వాటిని తుంగలో తొక్కితే ప్రజలు వారిని ఇంటికి సాగనంపారని చెప్పారు. కాలనీశాఖ కార్యదర్శి భూక్య రాజేష్, సభ్యులు యాకాంబరం, నాగేష్, సత్యనారాయణ, రవి, వెంకటేష్, రమేష్, లింగ, హట్యా, బాబురావు, సతీష్ పాల్గొన్నారు.

‘లయన్స్’ సేవలను గ్రామాలకు విస్తరింపజేయాలి

- లయన్స్‌క్లబ్ 320ఎఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి



మానుకోట శాఖ బాధ్యులకు అవార్డును అందజేస్తున్న కుందూరు వెంకట్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : లయన్స్‌క్లబ్ రీజియన్ పరిధిలోని 11 క్లబ్‌ల సామాజిక సేవలు అగ్రభాగాన నిలుస్తున్నాయని, వాటిని గ్రామాలకు విస్తరింపజేయాలని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్-320ఎఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్తిగార్డెన్స్‌లో గురువారం రాత్రి లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్-320ఎఫ్ ఆరవ రీజియన్ బీ1-బై మంత్లి మీటింగ్ రీజియన్ చైర్మన్ రామసహాయం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలను మరింత విస్తృత పరిచాలని సూచించారు. ఇటీవల భారీ వర్షాల సమయంలో మానుకోట క్లబ్ బాధ్యులు వరద బాధితులకు అందించిన సేవలు, సహాయాన్ని ప్రశంసించారు. ఇదే ఒరవడిని మున్ముందు కొనసాగించి పేదలకు, ఆపదలో ఉన్న వారి కి సహాయం అందించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం అత్యధికంగా నేత్రాలను సేకరించిన మానుకోట క్లబ్ బాధ్యులకు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.లక్ష్మీనర్సింహారావు, క్యాబినెట్ సెక్రటరీ హాబిబ్, హరికిషన్‌రెడ్డి, శారద, రమాణారెడ్డి, వెంకట్‌రెడ్డి, జోన్‌చైర్మన్లు రావుల రవిచందర్‌రెడ్డి, ఆర్.శ్రీదేవి, రీజినల్ కో-ఆర్డినేటర్ పీవీ. ప్రసాద్, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి,మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, బి.అనిల్‌గుప్తా, ఇంద్రసేనారెడ్డి, అనుమాల వెంకటేశ్వర్లు, పమ్మి సనాతనచారి, బవిరిశెట్టి నాగేశ్వర్‌రావు, ఆల్‌టెక్ రమేష్, మానుకోటశాఖ అధ్యక్షుడు యాళ్ల మురళీధరరెడ్డి పాల్గొన్నారు.

డీఏలను ప్రకటించాలి

టీఎస్‌యూటీఎఫ్ నేత మురళీకృష్ణ

నెల్లికుదురు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు ప్రభుత్వం ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్లగొండ, ఎమ్మెల్సీ అలుగుపెల్లి నర్సింహారెడ్డి విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఎంతో కృషిచేశాడన్నారు. ప్రభుత్వం నగదు రహిత ఉచిత కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా గుర్తించి 010 ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. టీఎస్ యూటీఎఫ్ నాయకులు చైతన్య, రంజిత్ జనార్ధన్, రాజయ్య, రవీందర్, యుగేందర్ పాల్గొన్నారు.

‘తుపాకులగూడెం’ ఎత్తు తగ్గింపుతో.. నీటి లభ్యతకు సమస్య లేదు

నీటిపారుదలశాఖ డివిజన్-2 ఈఈ జగదీశ్

‘ఆంధ్రజ్యోతి’ కథనానికి స్పందన



ములుగు, అక్టోబరు, 18 (ఆంధ్రజ్యోతి): తుపాకులగూడెం బ్యారేజీ ఎత్తు తగ్గింపుతో దేవాదుల ప్రాజెక్టు వద్ద నీటి లభ్యతకు ఎలాంటి సమస్య ఉండదని నీటిపారుదల శాఖ డివిజన్-2 ఈఈ వి.జగదీశ్ స్పష్టం చేశారు. బ్యారేజీలో 80మీటర్ల ఎత్తులో నీటి నిల్వ చేయడం వల్ల ఇచ్చంపల్లి ఆనకట్ట వరకు నీరు విస్తరించి ఉంటుందని, దేవాదుల వద్ద 9మీటర్ల నీరు నిల్వ ఉంటుందని వెల్లడించారు. ‘తుపాకులగూడెంపై తకరారు’ శీర్షికన ఈనెల 15న ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఈమేరకు లేఖను పంపారు. రూ.2121కోట్లతో తుపాకులగూడెం బ్యారేజీకి 2017లో అప్పటి ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చిందని, రూ.1624.83కోట్లకు ఒప్పందం జరగ్గా 83మీటర్ల ఎత్తుతో 59గేట్లతో బ్యారేజీ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని వెల్లడించారు. వన్యప్రాణ సంరక్షణ, పర్యావరణ, అటవీశాఖ అనుమతులు తీసుకున్నామని, తెలంగాణ భూభాగంలో ముంపునకు గురవుతున్న భూములకు భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. 2021 ఆగస్టు 31న బ్యారేజీ డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, హైడ్రాలజీ, పవర్, సీఎస్ఎంఆర్ఎస్, ఖర్చు అంచనా శాఖల అనుమతులు కూడా వచ్చాయని వివరించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపు గురించి ఆరాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలిపిందని, రెండు రాష్ట్రాల ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో ముంపు ప్రాంతాలను అంచనా వేశామని, ఈవిషయంలో ఇరు ప్రభుత్వాల నడుమ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో తుపాకులగూడెం బ్యారేజీలో నీటి నిల్వను 83మీటర్ల నుంచి 80మీటర్లకు తగ్గించడానికి అంగీకరించడం జరిగిందని తెలిపారు. దీంతో ఛత్తీస్‌గఢ్ వైపున భూభాగంలో నీరంతా నదీ గర్భంలోనే నిల్వ ఉంటుందని, భూములు ముంపునకు గురికావని స్పష్టంచేశారు. ఈ క్రమంలో భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని ఈఈ వెల్లడించారు.

‘ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి’

నెల్లికుదురు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌పై బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు మానుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు నాయిని సత్యపాల్‌రెడి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి తెలిపారు. నెల్లికుదురులోని కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఎమ్మెల్యేను నెల్లికుదురు పొలిమేర దాటనివ్వం అని యదవరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు గుగులోత్ బాలాజీనాయక్, పట్నంశెట్టి నాగరాజు, మాజీ వైస్‌ఎంపీపీ జెల్ల వెంకటేష్, రాస వెంకట్‌రెడ్డి, కుమ్మరికుంట్ల మహేందర్, వరిపెల్లి ఉప్పలయ్య, వద్ది రాజేష్, పులి వెంకన్న, జాగిరి యాకసాయిలు తుప్పతూరి రాజు, రావుల సతీష్, ఇట్టి దేవేందర్‌రెడ్డి, మల్లేశం, తూళ్ల నరేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాసం విత్తనాలు

ఇనుగుర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 75శాతం రాయితీపై పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశువైద్యాధికారి ఎం.రవీందర్ శుక్రవారం తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డును తీసుకొని రావాలని కోరారు.

డిగ్రీ, పీజీ కళాశాలల తరగతుల బంద్ ఉపసంహరణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఈనెల 18వ తేదీ నుంచి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల్లో తరగతులు ప్రారంభించి, యథావిధిగా కొనసాగిస్తున్నట్లు నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఈనెల 14 నుంచి కళాశాలలను నిరవధికంగా మూసివేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలనే డిమాండ్‌తో నిరవధికంగా కళాశాలలను మూసివేయడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు, కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు ప్రతీరోజు నిరసనలు చేపట్టారు. దీంతో కళాశాలల యాజమన్యాల సమస్యలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం త్వరలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేస్తామనే హామీ మేరకు కళాశాలలను యథావిధిగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ధ్వంసమైన బ్రిడ్జిలకు మరమ్మతులు చేయండి

- నియోజకవర్గానికి పాలిటెక్నికల్, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేయాలి
- ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయండి
- సీఎంకు ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్

కురవి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు డోర్నకల్ నియోజకవర్గంలో ధ్వంసమైన బ్రిడ్జిలను పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు. గురువారం రాత్రి మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి,రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస‌రెడ్డితో కలిసి సీఎంకు వినతిపత్రం అందించారు. భారీ వర్షాలకు ధ్వంసమైన ముల్కలపల్లి, పురుషోత్తమయగూడెం, బాల్ని ధర్మారం, చిన్నగూడూరు బ్రిడ్జిలు సహా ఇతర బ్రిడ్జిలను సత్వరమే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

డోర్నకల్ నియోజకవర్గంలో భారీ వర్షాలకు తెగిన చెరువులు, కుంటలు, రహదారులకు సత్వరమే మరమ్మతులు చేయించాలని కోరారు. వీటి కోసం డోర్నకల్ నియోజకవర్గానికి తక్షణమే నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డోర్నకల్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేసి, నిర్మాణం ప్రారంభించాలని కోరారు. నియోజకవర్గానికి పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను మంజూరుచేయాలని కోరారు.

కమిటీలను ఆమోదించవద్దని కలెక్టర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

తొర్రూరు, అక్టోబరు 18 : ప్రభుత్వం ఇటీవల గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రత్యేక కమిటీలు వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కమిటీల్లో అధికారులు కాంగ్రెస్ నాయకులు కలిపి ఎంపిక చేశారని, వాటిని ఆమోదించవద్దని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములు మాట్లాడుతూ మండల అధికారులు పంపిన కమిటీలను ఆమోదించవద్దని కలెక్టర్‌ను కోరడం జరిగిందన్నారు. నాయకులు ఎం.శ్రీనివాస్, బిందు శ్రీను, కుర్ర శ్రీను, ప్రమోద్, శ్రీనివాస రావు, ప్రదీప్ రెడ్డి, శంకర్, అంకుష్, వెంకన్న పాల్గొన్నారు.

‘శ్రీనిధి’లో బకాయి పడిన లబ్ధిదారుకు అధికారుల నోటీసులు



లబ్ధిదారుకు నోటీసులు అందజేస్తున్న ఐకేపీ సిబ్బంది

గార్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీనిధిలో బకాయిలు పడిన లబ్ధిదారులు తక్షణమే చల్లించాలని శ్రీనిధి రీజనల్ మేనేజర్ మధుసుదన్ అన్నారు. శుక్రవారం గార్ల లోని జీవంచిపల్లి గ్రామంలో శ్రీనిధిలో బకాయాలు పడ్డాసంఘాలకు చెందిన సభ్యులకు నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులు తీసుకున్న సంఘాల సభ్యులు వాయిదాలోపు బకాయిలు చెల్లించాలన్నారు. లేనిచో చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట శ్రీనిధి మేనేజర్ మారుతి, సీసీ లక్‌పతి, మండల మేనేజర్ రవి, గ్రామ దీపికలు సునిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కృష్ణారెడ్డి



శిక్షణలో సలహాలు, సూచనలు ఇస్తున్న కృష్ణారెడ్డి

నర్సింహులపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మంచినీటి సరఫరా సహాయకులు పనిచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కృష్ణారెడ్డి అన్నారు. నర్సింహులపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంచినీటి సరఫరా సహాయకుల శిక్షణలో భాగంగా మూడోరోజు శుక్రవారం ఆయన పాల్గొని పైపులైన్ మరమ్మతులు, లీకేజీ పనులపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇప్పుడున్న సాంకేతికతను ఉపయోగించి సీసీ రోడ్డు కింద ఉండబడిన పైపులకు సైతం మరమ్మతులు చేయవచ్చన్నారు. సాంకేతిక విధానాన్ని పూర్తిస్థాయిలో తెలుసుకోవడం మంచిదన్నారు. ఈనెల 16 నుంచి 19 వరకు జరిగే ఈ శిక్షణ తరగతులు నీటి సరఫరా సహాయకులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బందికి ట్రైనింగ్ సర్టిఫికేట్ సైతం ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా సహాయకులు అప్రమత్తంగా ఉంటేనే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందన్నారు. డీఈ శ్రీనివాస్, ఎంపీవో కిన్నెర యాకయ్య, ఏఈ రాకేష్, సిబ్బంది ఉన్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు



గాయపడిన శ్రీనివాస్, శంకర్

కేసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు 108 సిబ్బంది తెలిపారు. కాట్రపల్లికి చెందిన గుండ్ల శ్రీనివాస్ కేసముద్రం విలేజి వైపునకు బైక్‌పై వెళుతుండగా కోరుకొండపల్లికి చెందిన నర్సింగోజు శంకర్ మరో మోటార్‌సైకిల్‌పై కేసముద్రం స్టేషన్ వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇరువురికి తలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ వీరన్న, పైలెట్ ఉపేందర్ తెలిపారు.

52.2 మి.మీ వర్షపాతం నమోదు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం 52.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా సగటున 3.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని బయ్యారం మండలంలో 1.2 మిల్లీమీటర్లు, గార్లలో4.2,డోర్నకల్‌లో18.8, కురవిలో 0.8, మహబూబాబాద్‌లో 1.2, చిన్నగూడూరులో 1.2, మరిపెడలో 18.6, తొర్రూరు మండలంలో 6.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

నారాయణ స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజమౌళి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తన తుదిశ్వాస విడిచేంతవరకు పేదల పక్షాన నిలిచిన పోరాట యోధులు నున్నా నారాయణ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని నున్నా నారాయణనగర్‌లో శుక్రవారం దివంగత సీపీఎం నాయకుడు నున్నా నారాయణ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పంజాల ఉపేంద్ర, మచ్చవెంకన్న, ముస్తాఫా, మధు, రహీం, మంగమ్మ, భాగ్యమ్మ, వెంకటమ్మ, రామతార, ఐలమ్మ, ధర్మయ్య, ప్రసాద్, రాము, వెంకటాచారి, పూర్ణాచారి పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఆఫీస్ ఎదుట సీపీఎం ధర్నా

తొర్రూరు, అక్టోబరు 18 : తొర్రూరులోని గ్రంథాలయం ఎదుట పార్కింగ్ చేసిన ఎక్సైజ్‌శాఖ వాహనాలను వెంటనే తొలగించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి, మునిసిపల్ కమిషనర్‌కు శాంతి కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా ఎక్సైజ్‌శాఖ అధికారులు గ్రంథాలయం ముందు ఉన్న పార్కింగ్ స్థలంలో పలుకేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పెట్టడం వల్ల పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రద్దీ అధికంగా ఉండడంతో పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ నిలిపిన వాహనాలకు పోలీసులు చలాన్‌లు వేస్తున్నారన్నారు. వెంటనే సంబంధిత మునిసిపల్ ఎక్సైజ్‌శాఖ అధికారులు పార్కింగ్ స్థలంలో ఉన్న వందల వాహనాలను తొలగించాలన్నారు. లేనిచో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకూబ్, కె.యాకయ్య, శ్రీనివాస్, మధు, వెంకట్ రెడ్డి, సోమయ్య తదితరులు ఉన్నారు.

‘పెండింగ్ డీఏలను విడుదల చేయాలి’

తొర్రూరు, అక్టోబరు 18 : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు పత్రాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ప్రకాశ్, ప్రభాకర్, శ్రీనివాస్, చంద్రమౌళి ఉన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

చిన్నగూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, ఎస్టీ హాస్టళ్లను స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకొవాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాలల ఎస్‌వో లలిత, తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎంపీడీవో రామారావు ఆర్ఐ వెంకన్న, కార్యదర్శి సోమన్న తదితరులు ఉన్నారు.

నైపుణ్యంతో బోధన చేయాలి : ఎంఈవో

దంతాలపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు మెళుకువలతో విద్యాబోధన చేయాలని ఎంఈవో ఎం.శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె పెద్దముప్పారం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠశాలలో అందే మధ్యాహ్న భోజనం పనితీరుపై ఆరా తీశారు. స్థానిక ప్రధానోపాధ్యాయుడు ధరావత్ కిషన్‌నాయక్ విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం హర్షనీయమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిబంధనల ప్రకారం సమావేశం కావడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం.కిషన్‌నాయక్, ఉపాధ్యాయులు యాకూబ్‌పాష, అంజనేయులు, నగేష్, మల్లికార్జున్, రమేష్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన మౌంటెనర్ యశ్వంత్



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పర్వతరోహణ చేసిన మెమెంటో అందచేస్తున్న మౌంటెనర్ భూక్యా యశ్వంత్

మరిపెడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను మౌంటెనర్ భూక్యా యశ్వంత్ శుక్రవారం రాజభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు యశ్వంత్ పర్వతరోహణ ఫొటోలను అందచేశారు. ఈ సందర్భంగా గవర్నర్ యశ్వంత్‌ను అభినందించారు. పర్వతరోహణ విషయాలపై యశ్వంత్‌తో గవర్నర్ మాట్లాడి తనవంతు సహాయం ఉంటుందని భరోసా కలిపించి, ఆశీర్వదించినట్లు యశ్వంత్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తెలిపారు.

మహిళా సంఘాలకు పెరటికోళ్ల పంపిణీ



ఉప్పరపల్లిలో పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఐకేపీ సిబ్బంది

కేసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 11 గ్రామాల్లో పెరటికోళ్లను ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సంఘాల్లోని సభ్యులకు పంపిణీ చేసినట్లు ఏపీఎం రాజీర్ తెలిపారు. ఆరువారాల కోడిపిల్లలను రూ.110 చొప్పున ఒక్కొక్కరికి 20 కోడిపిల్లలను రుణం కింద పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలానికి వంద యూనిట్లు 2000 కోడిపిల్లలను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో సీసీలు, వీవోలు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ కమిటీ నియామకం

కొత్తగూడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘం ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) కొత్తగూడ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు ఆర్.వీరెందర్ నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంఘంఅధ్యక్షుడు నామోజు కృష్ణ, ప్రధాన కార్యదర్శి పాకాల స్వామిలకు నియామకపత్రాన్ని సారయ్య అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లా నారాయణరెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిళి, మాజీ జడ్పీటీసీ కందిమల్ల మధుసూదన్‌రెడ్డి, బొల్లు రమేష్, వెల్దండి వేణు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

బయ్యారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :రైతులకు మొక్కజొన్న నకిలి విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బయ్యారం ఏజన్సీలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రెతులకు నకిలి విత్తనాలు విక్రయించిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బయ్యారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రాన్ని తహసీల్దార్ విజయకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతాల్లో సాగయ్యే మొక్కజొన్న పంటను ఆసరాగ మలుచుకొని కొందరు వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకొని నకిలి విత్తనాలు విక్రయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధిక దిగుబడి వస్తుంది, అధిక లాభాలు వస్తాయంటూ నమ్మబలుకుతూ నకిలీ విత్తనాలు అంటగడుతున్నారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవటంతో పాటు రైతులకు నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు బిక్షం, నరసింహా, నాగేశ్వరరావు, మురళీక్రిష్ణ, శ్రీధర్, రాకేష్, మధు, చైతన్య పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

మరిపెడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మరిపెడ మండల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో క్షయ వ్యాధి నిర్మూలనపై ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే అనుమానితుల శాంపిల్స్ సేకరించి జిల్లా ఆస్పత్రికి పంపించామన్నారు. టెస్ట్ రిపోర్టులు వచ్చాక ఉచితంగా మందులు, రూ.500 పారితోషికం అందచేస్తామన్నారు. క్షయవ్యాధి మందులతో నయమవుతుందని చెప్పారు. వయోజన బీసీజీ ఇంజక్షన్లు పంపిణీ ఉంటుందన్నారు. సూపర్‌వైజర్లు సుదర్శన్, ఆచార్యులు, ల్యాబ్ టెక్నిషియన్స్ అనిత, రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్యపాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

పెద్దవంగర, అక్టోబర్18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సదస్సు శుక్రవారం మండలకేంద్రం నుంచి కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు అనపురం రవిగౌడ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు సంఘటితమై పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలన్నారు. కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, యాకయ్య, హరీష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

డీఏలను విడుదల చేయాలి

టీజీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను త్వరితగతిన ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్(టీజీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో శుక్రవారం కొమురంభీం విగ్రహానికి సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కుమారస్వామి, నాగేశ్వర్‌రావు, సిద్ధబోయిన బిక్షం, కల్తి భాస్కర్, రామకృష్ణ, పూనెం లక్ష్మీనారాయణ, భూమయ్య, కృష్ణ, రవీందర్, కిరణ్ పాల్గొన్నారు.